ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 19 ఏప్రిల్ 2025 | 5

కదిలింది.. కరుణరథం!



అమలాపురంలో సిలువతో విశ్వాసుల ర్యాలీ

కపిలేశ్వరపురంలో

గుడ్‌ఫ్రైడేను జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.. విశ్వాసులు సిలువ మోస్తూ.. కదిలింది కరుణరథం.. సాగిందీ క్షమాయుగం అంటూ ప్రార్థనా గీతాన్ని ఆలపిస్తూ క్రీస్తును కీర్తించారు.. ఉదయం నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. నలభై రోజుల ఉపవాస దీక్షలు ముగించారు.

8

రెండో ఉచిత సిలిండర్‌కు క్యూ..



- ఉమ్మడి జిల్లాలో వినియోగదారులు 13 లక్షలు
- 2,82,198 మంది గ్యాస్ బుకింగ్
- 1,09,592 మంది ఖాతాల్లో సొమ్ము జమ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రెండో ఉచిత సిలిండర్‌కు లబ్ధిదారులు క్యూకడుతున్నారు. వేగంగా బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతిరోజు పెద్దఎత్తున బుకింగ్స్ జరుగుతున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో సుమారు 13 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి రెండో ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ఆరంభమైంది. ఇప్పటివరకు 2,82,198 మంది వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోగా 1,09,592 మంది బ్యాంకు ఖాతాల్లోకి రూ.8.72 కోట్లు సబ్సిడీ సొమ్ము జమ అయింది. మిగిలిన వినియోగదారులకు మరో నాలుగు రోజుల్లో రాయితీ సొమ్ములు జమచేస్తారు. తూర్పుగోదావరి జిల్లాలో 91,382 మంది గ్యాస్ సిలిండర్లకు బుక్ చేసుకోగా 34,645 మంది వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.2.74 కోట్లు జమ అయింది. కాకినాడ జిల్లాలో 1,03,832 మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోగా, 41,223 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.3.27 కోట్ల రాయితీ సొమ్ము జమచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 86,984 మంది వినియోగదారులు గ్యాస్ సిలిండర్లకు బుక్ చేసుకోగా, 33,724 మందికి రూ.2.70 కోట్ల రాయితీ సొమ్ము జమచేశారు. వినియోగదారులు రెండో గ్యాస్ సిలిండర్‌ను ఈ ఏడాది జూలై 31వ తేదీలోపు బుక్ చేసుకోవాలని నిబంధన విధించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ దీపం-2 పథకానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తొలి విడత, రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్లు బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ఏదైనా కారణాల వల్ల రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమకాకపోతే ఆయా జిల్లాల పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని సంబంధిత అధికారులు వెల్లడించారు.

రె..డీఎస్సీ!

ఉపాధ్యాయ నిరుద్యోగులకు తీపికబురు



- నెరవేరనున్న కూటమి మరో హామీ
- ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లాలో 95 వేల మంది పైనే
- 42 నుంచి 44 ఏళ్లకు పెంపు
- వయో పరిమితి పెంపుతో ఊరట
- ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ
- సమాయత్తమవుతున్న విద్యాశాఖ

కాకినాడ రూరల్/ అమలాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. టీడీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నేడో రేపో నోటిఫికేషన్ విడుదలకానుంది. ఈనేపథ్యంలో ఎప్పటి నుంచో డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అడ్డంకులు దాటుకుని..

రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు కొన్ని లక్షల మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటూ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని విస్మరించింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347కు పైగా ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించి నవంబరులోనే ఫలితాలు ప్రకటించింది. కొన్ని సాంకేతిక కారణాలు, ఎమ్మెల్సీ కోడ్ అమలు, అభ్యర్థుల వయోపరిమితి పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవల సీఎం చంద్రబాబు, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో ఏప్రిల్‌లోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టుల భర్తీని జూన్ కల్లా పూర్తిచేస్తామని ప్రకటించడంతో అభ్యర్థులు నోటిఫికేషన్‌కు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనెల 20 లేదా 23న డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని తెలిసి హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల మందికిపైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

వయోపరిమితి 44

డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిని సడలిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం గరిష్ఠ వయోపరిమితి 42 ఏళ్లు కాగా దానిని 44 ఏళ్లకు పెంచారు. 2024 జూలై 1ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు.ఈ సడలింపు ఈ ఒక్క డీఎస్సీకి మాత్రమే వర్తిస్తుందన్నారు.

- ఏపీ ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఆర్డినెన్స్-25 జారీచేశారు. దీని ప్రకారం 3 ఎస్సీగ్రూపుల విషయంలో 200 రోస్టర్ పాయింట్ల విధానాన్ని అవలంబించనున్నారు. దీంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి వర్గీకరణ ఆర్డినెన్స్‌తో మార్గం సుగమమైంది.

వైసీపీ తెచ్చిన తంటా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా స్కూలు అసిస్టెంట్లు, ఎస్జీటీ పోస్టులు మొత్తం కలిపి 1026 ఖాళీగా ఉన్నట్టు విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అమలాపురం ఉప విద్యాశాఖాధికారి పరిధిలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 908 ఖాళీలను గుర్తించినట్టు అధికారులు నిర్ధారించారు. ఇంకా జిల్లాలో కొత్తపేట, రామచంద్రపురం సబ్ డివిజన్ల పరిధిలో ఖాళీల సంఖ్య తేలాల్సి ఉంది. అయితే ప్రభుత్వానికి నివేదించిన జాబితాలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోస్టుల సంఖ్య భారీగా కుదించి నివేదించినట్టు ఉపాధ్యాయ సంఘాల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్జీటీ పోస్టులు రద్దుచేసి వారిని వేరే పోస్టులకు కేటాయించారు. ఆ పరిస్థితుల కారణంగా ఇప్పటికీ ఎస్జీటీ పోస్టుల ఖాళీలపై స్పష్టత లేదని వారు ఆరోపిస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో ఎయిడెడ్ పోస్టులను రద్దు చేసి ఆయా పాఠశాలలను మాత్రమే ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే నోటిఫికేషన్‌కు నిరుద్యోగ యువకులు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. పోస్టుల్లో కోత విధిస్తే తమకు ఏమాత్రం ప్రయోజనం ఉండదనేది వారి ఆవేదన.

1278 పోస్టులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1,278 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీచేయనున్నట్టు సమాచారం. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఆంగ్లం 90, తెలుగు 70, హిందీ 71, గణితం 55, ఫిజికల్ సైన్స్ 59, బయోలాజికల్ సైన్స్ 95, సోషల్ స్టడీస్ 114, సంస్కృతం 5, వ్యాయామ విద్య 199, ఎస్జీటీలు 349, పీజీటీ, టీజీటీ ప్రిన్సిపాల్స్ మొత్తం 171 ఖాళీలు డీఎస్సీ ద్వారా భర్తీచేయనున్నట్టు తెలిసింది.

ప్రత్యేక విద్యకు 288 పోస్టులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక విద్యకు సంబంధించి 151 స్కూల్ అసిస్టెంట్లు, 137 ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీకానున్నాయి. వారంరోజుల్లోపు డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం.ఈ మేరకు విడిగా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన 45 రోజుల తరువాత పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది.

'సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏ మాత్రమూ సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరోసారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే'
– దేశ సర్వోన్నత న్యాయస్థానం

2019లో జైలులో ఆస్పత్రి శంకుస్థాపనకు సీఎం హోదాలో చంద్రబాబు వచ్చినప్పుడు.. 'మీరు మంచిగా మారండి. క్షమాభిక్ష జీవోల కోసం ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. చూసుకుంటాను' అని హామీ ఇచ్చారు. అయితే విధి దగా చేసింది. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చింది. దీంతో క్షమాభిక్ష అవకాశాన్నిఆ ప్రభుత్వంలో ఖైదీలు కోల్పోయారనే చెప్పాలి. ఇప్పుడు మళ్లీ అవకాశం వచ్చింది.. ఖైదీల విడుదలకు చర్యలు చేపడుతున్నారు.

ఖైదీలకూ.. నేనున్నానని..



జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

- కూటమి ప్రభుత్వంలో ఊరట
- సుప్రీం మార్గదర్శకాల అమలు
- జాబితాకు ప్రభుత్వ ఆదేశం
- కసరత్తులో జైలు అధికారులు
- వైసీపీ ప్రభుత్వంలో అన్యాయం
- గత జాబితా చెత్తబుట్టలోకి..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర మనోవేదన మిగిలింది. అప్పట్లో జగన్ ఖైదీల క్షమాభిక్ష పట్ల చేసిన కాలయాపన వారి పాలిట శాపంగా మారింది. 2023లో జాబితా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాలనూ అప్పటి వైసీపీ ప్రభుత్వం పాటించకపోవడంతో ఆ జాబితా ఇప్పుడు చెత్త బుట్టలో పడేసే పరిస్థితి వచ్చింది. దీంతో రెండేళ్లగా ఆ ఖైదీలు ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్ఎల్‌పీ (క్రిమినల్) నెం.529/2021లోని సుప్రీం ఆదేశాలను పాటిస్తూ ఈనెల 17న జీవో నెం.71 జారీచేయడంతో పెండింగ్‌లో ఉన్న జాబితా నీరు గారిపోయినట్టేనని చెబుతున్నారు. జైళ్లశాఖ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం క్షమాభిక్షకు అర్హులైన ఖైదీల జాబితా సిద్ధం కానుంది.

నాడు వైసీపీలో ఒక్కసారే..

సుప్రీం మార్గదర్శకాల ప్రకారం ఏడాదికి మూడు దఫాల్లో విడుదలకు అర్హులైన జాబితాలను అధికారులు ఎప్పటికప్పుడు పంపించినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో జగన్ ప్రభుత్వంలో ఎదురుచూపులతో ఖైదీలో జైలులోనే మగ్గిపోయారు. జగన్ జమానా ఐదేళ్లలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక జైలులో కలుపుకొని సుమారు 60 మంది మాత్రమే బయటకు వెళ్లారు. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినా ఏడాది ఆలస్యంగా ఆగస్టు 15న 2022లో విడుదల చేశారు. మరో అన్యాయం ఏమిటంటే.. 2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలా కాకుండా 2022 కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరేవారు.

సుప్రీం మార్గదర్శకాలు..

గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఖైదీలను విడుదల చేసేవి. దీంతో ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా నిబంధనలు ఉండేవి. వీటిపై సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీలు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు దేశం మొత్తానికి ఒకే విధమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. వాటి ప్రకారం ఆయా రాష్ట్రాలు జీవోలు ఇవ్వాలి. ఈ మేరకు కూటమి ప్రభుత్వం సుప్రీం మార్గదర్శకాలను అనుసరిస్తూ జీవో విడుదల చేసింది.

గతం : సాధారణ జీవిత ఖైదీలకు ఏడేళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65 ఏళ్లు దాటిన వాళ్లకు ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు శిక్ష పూర్తి చేస్తే క్షమాభిక్షకు అర్హత ఉండేది.

ప్రస్తుతం : అన్ని జెండర్లకూ ఒకేలా నిబంధనలు ఉన్నాయి. మరణశిక్ష పడిన వారికి 14 ఏళ్ల జైలు.. ఆరేళ్ల రెమిషన్ మొత్తంగా 20 ఏళ్ల శిక్ష అనుభవించి ఉండాలి (ఆరేళ్ల రెమిషన్ నమోదు కావాలంటే కనీసం 16 ఏళ్లపాటు సత్ప్రవర్తనతో జైలు జీవితం గడపాలి. జీవిత ఖైదులకు 7+3 ఉండాలి. ఎన్‌డీపీ ఎస్, ఎస్సీఎస్టీ కేసుల్లో, ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిజం చట్టం 2002 ప్రకారం, ఐపీసీ 363ఏ, 364, 364ఏ, 366, 366బీ, 367, 368, 369, 372, 373 ప్రకారం శిక్షపడిన వారు క్షమాభిక్షకు అర్హులు కాదు. మరికొన్ని నిబంధనలు ఇచ్చారు.

ఏడాదికి మూడు సార్లు

సుప్రీం మార్గదర్శకాలను అనుసరించి ఏడాదికి మూడుసార్లు క్షమాభిక్ష జీవోలను విడుదలచేస్తారు. మొదటి ఫేజుకు జూన్1, రెండో ఫేజుకు అక్టోబరు 1, మూడో ఫేజుకు ఫిబ్రవరి 1 కటాఫ్ తేదీలుగా పరిగణిస్తారు. నాలుగు దశల్లో ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.ఫేజ్ 1లో భాగంగా జనవరి 1 నుంచి 15వ తేదీలోపుగా, ఫేజ్ 2లో మే 1 నుంచి 15వ తేదీలోగా, ఫేజ్ 3లో సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీలోగా అర్హులైన ఖైదీలను గుర్తించాల్సి ఉంటుంది. ఆపై జైలు అధికారులు మూడు నెలల్లోగా సంబంధిత పత్రాలు సిద్ధం చేసుకోవాలి. జైలు అధికారులు ప్రిజన్స్ డైరెక్టర్ జనరల్‌కి సిఫారసు చేసిన తర్వాత మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందాలి. అనంతరం మూడు నెలల్లో ప్రభుత్వ నిర్ణయం వెలువడాలి. ఫేజ్1కి అక్టోబరు 1, ఫేజ్2కి ఫిబ్రవరి1, ఫేజ్ 3కి జూన్1లోగా ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంటుంది.



ఫొటో కావాలా?

ఆరు వేలు కొట్టు..

- వేట నిషేధ భృతి కోసం పడవల్లో ఫొటోలు దిగుతున్న బోటు యజమానులు, కళాసీలు
- భృతి పెంచడంతో పెరిగిన ఫొటో రేటు
- కళాసీలను దోచుకుంటున్న కొందరు బోటు యజమానులు

కాట్రేనికోన, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఫొటో దిగాలంటే రూ.6వేలు కొట్టాల్సిందే. కాదంటే ఫొటో రాదు. ఇది సరదాగా తీసుకునే ఫొటో కాదండోయ్. ఈ ఫొటో దిగితే బ్యాంకు ఖాతాలో రూ.20 వేలు వచ్చిపడతాయి. విషయానికి వస్తే ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు సముద్రంలో అన్ని రకాల బోట్లతో చేపల వేట నిషిద్ధం. అయితే వేట నిషిద్ధ కాలానికి ప్రభుత్వం వేట నిషేధ భృతి చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో ఈ భృతి రూ.10 వేలు కాగా, కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచింది. ఈ పథకంలో ప్రతి బోటుకు యజమానితోపాటు మరో అయిదుగురు కళాసీలకు ఈ భృతి ఇస్తారు. దీనికోసం మత్స్యకార గ్రామాల వారీగా బోట్ల యజమానులు, కళాసీలను గుర్తించి లబ్ధిదారుల జాబితా తయారుచేస్తారు. ఏటా మాదిరిగానే మండలంలోని 12 మత్స్యకార గ్రామాల్లో 834 బోట్లను గుర్తించి శుక్రవారం సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా బోటు యజమానితోపాటు అయిదుగురు కళాసీలను బోటులో నిలబెట్టి ఫొటో తీస్తారు. ఈవిధంగా ఫొటో దిగిన వారి వివరాలను మత్స్యశాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తారు. ఈ ప్రకారమే వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము చేరుతుంది. ఇక్కడే కొందరు బోటు యజమానులు మాయాజాలం చేస్తున్నారు. ఇంత కాలం తమ బోట్లలో పనిచేస్తున్న వారికి బదులు కొత్తవారితో యజమానులు ఫొటోలు దిగారు. దీనితో అసలు కళాసీలు లబోదిబోమంటున్నారు. గతంలో తాము వేట నిషేధ భృతిని తీసుకున్నామని, ఇప్పుడు తమను పక్కనపెట్టారని వాపోతున్నారు. ఏటా తాము కూడా భృతిలో కొంతసొమ్మును యజమానులకు ముట్టచెబుతున్నామని పెద్దలకు మొరపెట్టుకున్నారు. ఈ ఏడాది తమను కాదని కొత్తవారిని బోటులో నిలబెట్టి ఫొటోలు తీయించారన్నారు. గతంలో భృతిలో యజమానులకు రూ.3 వేలు ఇచ్చే ఒప్పందం ఉందని, ఈ ఏడాదీ అలాగే ఇస్తామని చెప్పామని, అయితే రూ.6 వేలు తీసుకుని కొత్తవారిని జాబితాల్లో చేర్చారంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కేవలం బలుసుతిప్పలోనే 469 బోట్లు ఉండగా, వేరే ప్రాంతాల నుంచి 1000 మంది కొత్తవారిని తీసుకొచ్చారని ఆరోపించారు. అసలైన కళాసీలకు న్యాయం చేయాలని కోరారు.

ప్రతిపాదనలతో సరి!





సలాదివారిపాలెం వద్ద కోతకు గురైన కొబ్బరి తోట

- ఆచరణకు నోచుకోని హామీలు
- ప్రతీ ఏటా ఎంతోకొంత భూమిని కబళిస్తున్న గోదావరి వరద
- లంక వాసులకు తప్పని గుండెకోత



లంకాఫ్‌ఠాణేలంక పంచాయతీ పరిధిలో కూనాలంక వద్ద గుత్తాలవారి పేటలో కోతకు గురైన ఇళ్లు

ముమ్మిడివరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): 'మరో పక్షం రోజుల్లో లంక భూముల రక్షణకు టెండర్లు పిలుస్తాం.. మరో నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తాం.. జిల్లా కలెక్టరే స్వయంగా ఇక్కడ పనుల ప్రగతిని ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, అయినవిల్లి మండలాల్లోని లంక భూముల నదీ కోత నివారణకు రూ.150 కోట్లు కేటాయిస్తున్నా. అదీ సరిపోకపోతే మరో రూ.50 కోట్లు ఇస్తా...' ఇది 2023 ఆగస్టు 8న నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి లంకవాసులకు ఇచ్చిన హామీ. వరద ప్రభావిత గ్రామాలైన లంక గ్రామాల్లో ప్రజలను పరామర్శించేందుకు విచ్చేసిన జగన్మోహన్‌రెడ్డి దృష్టికి లంక వాసులు నదీకోత విషయాన్ని తీసుకువెళ్లగా ఆయన 3.700 కిలోమీటర్ల మేర లంక భూములకు రివిట్‌మెంట్, పిచ్చింగ్ వంటి పనులు చేపట్టనున్నట్టు ప్రకటించారు. గురజాపులంకలో 600 మీటర్లు, కూనాలంకలో 800 మీటర్లు, లంకాఫ్‌ఠాణేలంకలో 400 మీటర్లు, పళ్లవారిపాలెం వివేకానంద వారధి వద్ద 300 మీటర్లు, అయినవిల్లి మండలం కొండుకుదురులంక వద్ద 600 మీటర్లు, పొట్టిలంకలో వెయ్యి మీటర్ల మేర రివిట్‌మెంట్, పిచ్చింగ్ వంటి పనులు చేపడతామని చెప్పారు. కానీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

తర్వాత కూటమి నేతలు కూడా ఎన్నికల్లో లంక గ్రామాల రక్షణకు హామీ ఇచ్చారు. గతేడాది ఆగస్టు నెలలో వరదలు సంభవించినప్పుడు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు లంక గ్రామాల్లో వరద బాధితులను పరామర్శించి నియోజకవర్గంలో నాలుగు కిలోమీటర్ల మేర లంక గ్రామాల రక్షణ చర్యలకు రివిట్‌మెంట్, పిచ్చింగ్ పనులకు రూ.230 కోట్లతో అంచనాలు రూపొందించినట్టు చెప్పారు. గురజాపులంక-కూనాలంకల మధ్య రెండు కిలోమీటర్ల మేర పనులకు రూ.కోటి 20లక్షలు, సలాదివారిపాలెం వద్ద 1500 మీటర్ల మేర రక్షణ చర్యలకు రూ. 80 కోట్లు, ఐ.పోలవరం మండలం మురమళ్ల వద్ద 500 మీటర్ల మేర పనులకు రూ.30 కోట్లు అంచనాలు రూపొందించినా అవి కార్యరూపం దాల్చలేదు. మళ్లీ వరదలు వస్తే లంకభూమి నదీ కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.

ఏటా ఇదే కష్టం..

గోదావరికి వరదలొచ్చినప్పుడల్లా నదీ పరీవాహక ప్రాంతాల్లోని నివాస గృహాలు, గుడులు, బడులు, విలువైన భూములు కోతకు గురవుతున్నాయి. ఇదే పరిస్థితి మరి కొంత కాలం సాగితే లంక గ్రామాలు నదీ గర్భంలో కలిసిపోయి చిత్రపటం నుంచి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. దీనికితోడు లంక గ్రామాల్లో విచక్షణారహితంగా మట్టి, ఇసుక తవ్వకాలు సాగించడం వల్ల నదీ ప్రవాహక దిశ మారి భూములు కోతకు గురవ్వడాన్ని మరో కారణంగా చెప్పొచ్చు.

లంక మేత.. గోదారి ఈతలా...

ముమ్మిడివరం మండలంలోని కమిని, లంకాఫ్ ఠాణేలంక గ్రామాలు గోదావరి నదీపాయల మధ్య ఉన్నాయి. కమిని గతంలో రెవెన్యూ గ్రామం. నాటి వార్షిక ఆదాయం రూ.60 వేలు. 3015 ఎకరాల భూమి ఉండేది. గురజాపులంక, సలాదివారిపాలెం, వలసలతిప్ప గ్రామాలు చాలావరకు నదీ కోతకు గురికాగా.. పొట్టితిప్ప, గురజాపులంక గ్రామాలు ఎక్కువగా కోతకు గురవుతున్నాయి. కమినిలో సుమారు 1,900 ఎకరాల భూమి నదీ పాతమైంది. ఇంకా 1,100 ఎకరాల భూమి మిగిలి ఉంది. గ్రామ పంచాయతీ కార్యాలయం, కచేరీ చావిడి, రామాలయం, పాఠశాలం, మండువా లోగిళ్లు, మంచినీటి బావులు నదీ గర్భంలో కలిసిపోయాయి. దీంతో కొన్ని కుటుంబాలు ప్రస్తుతం వలస వెళ్లిపోయారు. 264 కుటుంబాలకు చెందిన 1,020 మంది జనాభా ఉన్నారు. లంకాఫ్ ఠాణేలంక గ్రామం గతంలో ఠాణేలంకలో అంతర్భాగంగా ఉండేది. ఠాణేలంక నుంచి పళ్లవారిపాలెం పంచాయతీగా ఏర్పడింది. తరువాత పళ్లవారిపాలెం పంచాయతీ నుంచి లంకాఫ్ ఠాణేలంక పంచాయతీ ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. ఆ గ్రామంలో 600 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా 792 కుటుంబాలకు సంబంధించి 2,378 మంది జనాభా ఉన్నారు. ఇటీవల 200 ఎకరాల వ్యవసాయ భూమి కోతకు గురైంది. గోదావరి ఆధునికీకరణ పథకంలో 2008లో రూ.22 కోట్లతో గ్రోయిన్లు, రివిట్‌మెంట్ వంటి పనులుచేశారు. అయినవిల్లి మండలం యలకల్లంక నుంచి కమిని పంచాయతీ పరిధి గురజాపులంక వరకు పలుచోట్ల గ్రోయిన్లు నిర్మించగా, వరదలకు కొంత దెబ్బతిన్నాయి.పళ్లవారిపాలెం-లంకాఫ్‌ఠాణేలంక గ్రామాల మధ్య 1998-99లో రామకృష్ణ మిషన్ రూ.3.25 కోట్లతో వివేకానంద వారధి నిర్మింపజేశారు. ఆ వారధి వద్ద లంకవైపు భూమి 20మీ. వెడల్పున 50మీ. పొడవున కోతకు గురవుతోంది. రక్షణకు చర్యలు చేపట్టాలని లంక వాసులు కోరుతున్నారు.

సెలవులకు స్వగ్రామం వచ్చి మృత్యువాత

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి




మరణించిన బూల వెంకటరత్నం, (ఫైల్‌ఫొటో)

మామిడికుదురు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం పెదపట్నం లంక గ్రామానికి చెందిన బూల వెంకటరత్నం (34) మృతిచెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వెంకటరత్నం సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కరెంటు సామాన్లు కొనడానికి మామిడికుదురు వచ్చి ప్రమాదానికి గురైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న వెంకటరత్నం 3రోజులు సెలవు రావడంతో స్వగ్రామం వచ్చి మృత్యువాత పడ్డాడని కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులకు కలచివేస్తుంది. ఏడేళ్ల క్రితం లక్ష్మీదుర్గతో వివాహం కాగా, వారికి ఐదేళ్ల కుమారుడు భరత్‌శ్రీసాయి, రెండేళ్ల కుమార్తె మాధురిలక్ష్మి ఉన్నారు. వెంకటరత్నం మృతితో తాము జీవనాధారం కోల్పోయామని ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసినట్టు నగరంఎస్ఐ ఎ.చైతన్యకుమార్ చెప్పారు.

ధాన్యం గుట్టను ఢీకొని వ్యక్తి మృతి



వీరవెంకట రమణ (ఫైల్‌ఫొటో)

దేవరపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం కృష్ణంపాలెం సర్వీసు రోడ్డులో ధాన్యం గుట్టను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. మండలంలో కృష్ణంపాలెం యర్నగూడెనికి చెందిన పుట్టా వీరవెంకటరమణ (30) అమ్మమ్మ ఊరైన కొత్తగూడెంలో ఉంటున్నాడు. రోజువారీ కూలి పనికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి సుమారు 2.30 గంటల ప్రాంతంలో యర్నగూడెం నుంచి ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వెళ్తుండగా కృష్ణంపాలెం సమీపంలోని రహదారిపై ఆరబెట్టిన ధాన్యం గుట్టను ఢీకొని తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టి

రాగి వైరు, ఆయిల్ చోరీ

దేవరపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా యర్నగూడెం, సంగాయిగూడెం మధ్యలోని ఆచంట శేషారావుకు చెందిన పొలంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టి విలువైన రాగి వైరు, ఆయిల్‌ను దొంగిలించుకుపోయారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈకి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు శేషారావు పేర్కొన్నాడు. ఇటీవల పొలాల్లో విద్యుత్ వైర్లు కోసుకుపోవడం, ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి రాగి వైర్లు దొంగిలించటం వంటి సంఘటనలు జరుగుతున్నాయని, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

సంగాయిగూడెంలో చోరీ జరిగిన ప్రదేశం

రూ.200 నోటు మార్చాలని కోరినందుకు..

వ్యక్తిపై కిరాణా షాపు యజమాని, అనుచరుడి దాడి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రూ.200 నోటుకు సిరా మరక ఉందని, నోటు మార్చాలని కోరినందుకు తనపై దాడికి పాల్పడ్డారంటూ జనిపల్లి శ్రీను ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకెళితే కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ గాంధీబొమ్మకాలనీకి చెందిన జనిపల్లి శ్రీను గురువారం మధ్యాహ్నం రూ.500 నోటు ఇచ్చి స్థానికంగా జనచైతన్య లేఅవుట్‌కాలనీకిచెందిన లక్ష్మీ కిరాణా షాపు వద్దకు వెళ్లి సుమారు రూ.300 విలువ కిరాణా సామాన్లు కొనుగోలు చేశాడు. దీంతో ఆ షాపు యజమాని మిగిలిన చిల్లరతోపాటూ రూ.200 నోటు ఇచ్చాడు. సిరా ఇంక్ మరక అంటిన నోటుకిబదులు మరొక నోటు ఇవ్వాలని యజమానిని కోరగా, ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా యజమాని తన అనుచరుడ్ని ఫోన్ చేసి రప్పించి తనపై కర్రతో చేతిపై, బుర్రపై దాడి చేయించినట్టు బాధితుడు శ్రీను తెలిపాడు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ బాధితుడ్ని పరామర్శించి దాడికి పాల్పడిన వ్యాపారి, అనుచరుడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడికి మద్దతుగా నిరసన తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇంద్రపాలెం ఎస్ఐ సూర్యకుమార్ తెలిపారు.

హైవోల్టేజీ సమస్యతో

20 టీవీలు, 10 ఫ్రిజ్‌లు, 20 ఫ్యాన్లు దగ్ధం

కామరాజుపేటలో సంఘటన




గోకవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం మండలంలోని కామరాజుపేటలో హైవోల్టేజ్ సమస్యతో గురువారం రాత్రి గృహోపకరణ వస్తువులు దగ్ధమయ్యాయి. గ్రామంలోని పెద రామాలయం వీధిలో ఈ సంఘటన జరిగింది. వినియోగంలో ఉన్న సుమారు 20 టీవీలు, 10 ఫ్రిజ్‌లు, 20 ఫ్యాన్‌లు, మోటార్లు, ఏసీలు, తదితర గృహపకరణ సామాగ్రి హైవోల్టేజ్‌తో కాలిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈప్రాంతంలో ఎంతోకాలం నుంచి హైవోల్టేజ్, లోవోల్టేజ్ సమస్య వేధిస్తున్నప్పటికీ సంబంధింత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాలిపోయిన గృహోపకరణ వస్తువులు

ఉపాధ్యాయులందరూ 26లోపు

నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందాలి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ పాఠశాల విద్యా శాఖ సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం పూర్వపు తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ బదిలీ నియంత్రణ చట్టం ప్రకారం నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందాలని కాకినాడ జిల్లా డీఈవో రమేష్ కోరారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ప్రత్యేక పాయింట్లు పొందేందుకు అర్హత ఉన్న వారు కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 24 నుంచి 26వ తేదీలోపు అనారోగ్య సంబంధిత సర్టిఫికెట్లను చూపించి నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఈ క్యాంపులో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మెడికల్ చెకప్ చేయించుకుని వైద్యుడి నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకున్నది మాత్రమే ప్రిఫరెన్షియల్ కేటగిరీలో సమర్పించాలని డీఈవో సూచించారు.



కాకినాడకు చెందిన ఆకి వీర వెంకట నారాయణ సాయిమనోజ్‌కు, గొల్లప్రోలుకి చెందిన గ్రంధి పద్మావతి రత్నలక్ష్మి రాధాదీపికలకు గొల్లప్రోలులోని సత్యకృష్ణ కన్వెన్షన్‌లో శుక్రవారం రాత్రి వివాహం జరిగింది. సాయంత్రం వారిద్దరూ ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై ప్రదర్శనగా వివాహ వేదిక వద్దకు వెళ్లి అందరి దృష్టినీ ఆకర్షించారు.

జోడెడ్ల బండి.. జోడీగా వచ్చారండి!

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి)

వైద్యం అందితే బా'గుండె'...

- కాకినాడ జీజీహెచ్‌లో గుండె వ్యాధులకు అరకొర వైద్యం
- కొన్నేళ్లుగా వేధిస్తున్న వైద్యులు, పరికరాల కొరత
- వేలాదిగా వస్తున్న రోగులను పరీక్షించేది ఒకరిద్దరు వైద్యులు మాత్రమే

నిరుపేదైన వెంకట్రావుకు ఓ రాత్రి వేళ అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చింది.. వెంటనే అతడిని కుటుంబసభ్యులు ఆపసోపాలు పడి ఆటోపై కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఓపీ తీసుకుని అత్యవసర విభాగంలో చేర్చారు. ఆ సమయంలో గుండెకు సంబంధించిన వైద్యులు లేరో.. ఏమో అతడికి మాత్రం సకాలంలో వైద్యం అందలేదు. ఉదయం ఎప్పుడో డాక్టర్లు వచ్చి వైద్య పరీక్షలు చేశారు. ఛాతిలో నొప్పి వచ్చి కొన్ని గంటలు గడిచినా అదృష్టవశాత్తూ అతడి ప్రాణాలకు ఎటువంటి ముప్పు వాటిల్లలేదు. వాస్తవానికి గుండెలో నొప్పి వచ్చిన వారికి నిమిషాల వ్యవధిలోనే వైద్య పరీక్షలు, వైద్యం అందాలి. లేకుంటే ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి కూడా ఉంటుంది. ఇతడే కాదు.. ఇలాంటి వారెందరో కాకినాడ జీజీహెచ్‌కు వచ్చి.. పడరాని పాట్లు పడుతున్నారు. పైసలు ఖర్చు చేసి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే స్థోమత లేక ఆసుపత్రిలోనే మగ్గిపోతున్నారు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)



కాకినాడ జీజీహెచ్‌లో గుండె వ్యాధుల చికిత్స విభాగం

కాకినాడ జీజీహెచ్‌లో పనిచేసే ఓ పెద్ద డాక్టరమ్మకు రెండు రోజుల కిందట ఓ రాత్రి వేళ సడన్‌గా హార్ట్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే ఆమెను ఆగమేఘాల మీద కాకినాడలో ఓ పేరున్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు ఈసీజీ, టూడీ ఎకోటెస్ట్‌లు, యాంజియోగ్రామ్ ఇలా అత్యాధునిక పరికరాలతో రకరకాల టెస్టులు చేసి, చివరికి స్టంటు వేశారు. ఐసీయూ రూమ్‌లో ఉంచారు. ఆమె ఆర్థికంగా స్థితిమంతురాలు కావడం, ఎంతోమంది పేదలకు వైద్య సేవలందించే పెద్దాసుపత్రిలో పెద్ద డాక్టరమ్మ కావడంతో అన్నీ క్షణాల్లో అందాయి. ఆమెకు ఎటువంటి అపాయం లేదని, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే ఎన్నో ఏళ్లుగా ఈ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఈ వైద్య నిపుణురాలు ఎంతోమందికి వైద్యం చేసి ప్రాణాలు నిలిపిన కాకినాడ జీజీహెచ్‌ను వదిలి ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదంతా ఎందుకంటే...

కాకినాడ జిల్లా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి.. దశాబ్దాల తరబడి ఎంతో మందికి ఎన్నో రకాల వైద్య సేవలందిస్తోన్న అతి పెద్ద ఆసుపత్రి.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులే కాదు.. అటు పశ్చిమ గోదావరి జిల్లా వాసులు కూడా ఇక్కడికి వైద్యం కోసం వస్తుంటారు. ఎందుకంటే ఈ ఆసుపత్రి అంటే అంత నమ్మకం.. నిష్ణాతులైన వైద్యులు ఉంటారని, మెరుగైన వైద్యం అందించి.. ప్రాణాలు నిలబెడతారనే గట్టి విశ్వాసం. సుమారు వెయ్యికిపైగా ఇన్‌పేషంట్లు ఉండే ఈ ఆసుపత్రిలో సుమారు 500కి పైగా వైద్యులు ఉన్నారు. వారిలో ప్రత్యేక వైద్య నిపుణులు కూడా ఉన్నారు. అందుకే చుట్టుపక్కల ప్రాంతాల ఆసుపత్రి వారు కూడా అత్యవసర కేసులను ఇక్కడికే రిఫర్ చేస్తారు. ఇంత పేరున్న ఆసుపత్రిలో సామాన్యులకు సరైన వైద్యం సకాలంలో అందడం లేదని జన మెరిగిన సత్యం. ఈ ఆసుపత్రిలోని గుండె వ్యాధుల విభాగం గురించి తెలుసుకోవాలంటే కాస్త గుండె నిబ్బరం చేసుకుని చదవక తప్పదు. ఈ విభాగంలో ప్రస్తుతం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. ఇటీవల ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌ను నియమించినా విధుల్లోకి చేరలేదు. ప్రొఫెసర్‌తోపాటు మరో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం మెడికల్ విభాగానికి చెందిన హెచ్‌వోడీయే ఈ గుండె వ్యాధుల విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇద్దరు వైద్యులు, పీజీలు సేవలందిస్తున్నారు. ప్రాథమిక పరీక్షలు చేసినా శస్త్ర చికిత్సలు, స్టంట్లు వేయడంవంటి పరిస్థితులు ఇక్కడ లేవు.

గడిచిన మూడేళ్లలో జీజీహెచ్‌లో గుండె వ్యాధిగ్రస్తుల వివరాలు పరిశీలిస్తే..

2022లో అవుట్ పేషెంట్లు 23080, ఇన్‌పేషెంట్లు 4041
2023లో అవుట్ పేషెంట్లు 26849, ఇన్‌పేషెంట్లు 3179
2024లో అవుట్ పేషెంట్లు 30873, ఇన్‌పేషెంట్లు 3560

రోజుకి 200 మందికి ఓపీ..

ఇటీవల కాలంలో గుండె జబ్బులతో బాధపడే వారి సంఖ్య బాగా పెరిగింది. మారిన ఆహారపు అలవాటు, వ్యాయామం చేయకపోవడం, ఇలా రకరకాల కారణాలతో హృద్రోగులుగా మారుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అత్యవసర కేసులన్నీ కాకినాడ జీజీహెచ్‌కే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ప్రత్యేకంగా ఓపీ నిర్వహిస్తుంటారు. ఆయా రోజుల్లో రోజుకి సుమారు 200 మంది వరకు రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. అలాగే పలు వార్డుల్లోనూ ఇన్ పేషెంట్లుగా ఉంటూ కొందరు వైద్య సేవలు పొందుతారు.

పరికరాల కొరత..

కార్పొరేట్‌కు దీటుగా ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నాం.. దాతల సహకారంతో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నాం అని చెబుతున్నా.. అవన్నీ కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. పెద్దాసుపత్రి అన్న మాటే తప్ప.. పరికరాల కొరత మాత్రం బాగా వేధిస్తోంది. ఇక్కడ క్యాథ్ ల్యాబ్‌లో హృద్రోగులకు వైద్య పరీక్షలు చేస్తారు. యాంజియోగ్రామ్ ద్వారా రక్తనాళాల్లో బ్లాక్‌లను గుర్తిస్తారు. అవి తెరుచుకునేలా స్టంట్లు వేస్తారు.. పేస్ మేకర్‌తో సాధారణంగా గుండె కొట్టుకునేలా చేస్తారు. నెలకు సుమారు 20 వరకు యాంజియోగ్రామ్ పరీక్షలు చేస్తున్నట్టు సమాచారం. ఇక్కడ ఒక్కో పరీక్షకు రూ.పది వేల విలువైన పరికరాలు ఉండాలి. అయితే వాటిని రోగులే సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో వైద్య పరీక్షలకు, చికిత్సకు అవసరమైన సదుపాయాలు తక్షణం కల్పించాల్సి ఉంది. అరకొరగా ఉన్న గుండె వైద్య నిపుణులను తగిన సంఖ్యలో నియమించాలని రోగులు, వారి కుటుంబీకులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు

22 మంది క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న సెలక్షన్ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ

రాజోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు 22 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని సెలక్షన్ కమిటీ చైర్మన్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎంపికలకు సభ్యులుగా బాబి, చెల్లింగి ప్రసాద్, జిల్లా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్, భీమేష్‌లు ఎంపికలు నిర్వహించారు. 50 మంది క్రీడాకారులు జిల్లా మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్నట్టు పాల్గొనగా 22మంది క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్‌బాల్ టీమ్ ఈనెల 26,27 తేదీల్లో సత్యసాయి జిల్లా కదిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను గోపాలకృష్ణ, ప్రసాద్, లక్ష్మణ్ అభినందించారు.

అన్నవరం దేవస్థానంలో మద్యం తాగి ఉద్యోగి విధులు

క్రమశిక్షణా చర్యలకు ఈవో ఆదేశం

అన్నవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో దిగువ ప్రసాదం కౌంటర్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మద్యం తాగి ఉండడం, ఒక భక్తురాలిపై దురుసుగా ప్రవర్తించడంతో అతడిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఈవో సుబ్బారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. కొండదిగువన ప్రసాదం కౌంటర్లో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుబ్బారావు మద్యం తాగి విధులు చేస్తుండడమే కాకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో ఈవో సుబ్బారావు నేరుగా వెళ్లి ఉద్యోగి కి బ్రీత్ ఎన్‌లైజర్ చేయగా 150 శాతం ఉండడంతో మద్యం తాగి ఉన్నట్లు గుర్తించారు. దీనిపై చర్యలకు ఆయన ఆదేశించారు. ఇటీవల కాలంలో దేవస్థానంలో పలువురు మద్యం తాగి విధులకు రావడం చర్చనీయాంశమైంది.

సూపరింటెండెంట్ బదిలీ

అన్నవరం దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఐవీ రామారావును ద్వారకా తిరుమల దేవస్థానానికి బదిలీ చేస్తూ దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల దేవస్థానంలో పలు వివాదాలు రావడానికి ఆయన ప్రధాన కారణంగా నిలిచారని ఈవో, సిబ్బందికి అంతరం ఏర్పడడానికి ఆయనే కారణమంటూ పలు ఆరోపణలు వినిపించాయి. ఇక్కడ విషయాలను క్షుణ్ణంగా తెలుసుకున్న కమిషనర్ బదిలీ వేటు వేశారు.

కరుణాకర్ రెడ్డి విమర్శలు హేయం

టీటీడీ మెంబర్ జ్యోతుల నెహ్రూ



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన గోశాలలో గోవులు మరణించాయని సుదీర్ఘకాలం బోర్డులో పనిచేసిన కరుణాకర్ రెడ్డి విమర్శలు చేయడం అత్యంత హేయమని టీటీడీ మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో నెహ్రూ మాట్లాడుతూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఎప్పుడైనా టీటీడీ గోశాలను పరిశీలించారా అన్ని ప్రశ్నించారు. అప్పట్లో వైఎస్సార్ తర్వాత జగన్ కరుణాకర్ రెడ్డిని టీటీడీ చైర్మన్‌గా చేస్తే తిరుపతి రైల్వేస్టేషన్లో దర్శనం టికెట్లు బ్లాక్‌లో అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. టీటీడీ బోర్డు, కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. పశు సంపదను సంరక్షించేందుకు టీటీడీ బోర్డు మూడు గోశాలలను ప్రతిష్టాత్మకంగా నడుపుతోందన్నారు. బోర్డు మీటింగ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్న కరుణాకర్ రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు.

సత్యదేవుని సన్నిధిలో రైల్వే డీఆర్ఎం పూజలు



సత్యదేవుని దర్శనానంతరం రైల్వే డీఆర్ఎం

అన్నవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం రైల్వే డీఆర్ఎం నరేంద్రపాటిల్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులున్నారు. అలాగే స్వామివారి సన్నిధిలో శుక్రవారం కాకినాడ అర్బన్ డవలెప్‌మెంట్ చైర్మన్ తుమ్మల రామస్వామి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆయన వెంట దేవస్థానం ఉద్యోగుల సంక్షేమసంఘం అధ్యక్షుడు గంటా విష్ణు ఉన్నారు.

పాదగయలో...

పిఠాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఆనందరావు పాటిల్ శుక్రవారం సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం ఆలయ వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ అధికారులు డీఆర్ఎంను శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. డీఆర్ఎం వెంట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బి.శివప్రసాద్, సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజరు ఎం.రమేష్, కాకినాడ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ వెంకటగిరి, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జనార్ధనరావు, ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులు టి.ఈశ్వరరావు, జి.రవికాంత్ తదితరులు ఉన్నారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో పూజల్లో పాల్గొన్న రైల్వే డీఆర్ఎం కుటుంబ సభ్యులు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

పిఠాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాదగయలో నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన బొండా సుబ్బారావు రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అధికారులకు అందజేశారు. కొత్త సూర్యనారాయణ (బొండా పెద్ద బాయి) సతీమణి రావయ్యమ్మ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందించి అన్నదానం చేయాలని కోరారు. దాతను అధికారులు సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేశారు.



విరాళం అందజేస్తున్న దాత

శ్రామిక.. లేఇక!



రాజమహేంద్రవరం నగరాన్ని నిరంతరం శుభ్రంగా ఉంచే శ్రామికులు విధుల్లో మాత్రం కాస్త అజాగ్రత్తగా ఉంటున్నారు. దానికి నిదర్శనం ఈ ఫొటోలే. విధుల్లో భాగంగా ట్రాక్టర్ భాగాన ముందు కూర్చున్న కార్మికులు రోడ్డుపై పడతామేననే ఆలోచన పక్కన పెట్టి ప్రమాదభరితంగా వెళ్తున్నారు. ఒకవేళ ఏదైనా అనుకోని సంఘటన జరిగితే అప్పుడు ఏం చేసినా ప్రయోజనం ఉండదు కదా..

స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ -రాజమహేంద్రవరం

అన్నదాన ట్రస్టుకు విరాళం
ఐ.పోలవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కరీంనగర్‌కు చెందిన చిగురు కొమురయ్య, లక్ష్మి దంపతులు రూ.10,116 శుక్రవారం ఆలయ పర్యవేక్షణాధికారి కటారి శ్రీనివాసరాజుకు అందించారు. ఆలయ సిబ్బంది దాత దంపతులకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.80లక్షలు
ఆత్రేయపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామిని శుక్రవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,80,428 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు

కోకో గింజలకు లాభసాటి ధర కల్పించాలి

● అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్‌కు వినతిపత్రం


అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎస్ నాయకులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కోకో గింజలకు లాభసాటి కల్పించాలని కోరుతూ భారతీయ కిసాన్ సంఘ్ జిల్లాశాఖ ప్రతినిధుల బృందం శుక్రవారం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు వినతిపత్రం అందజేశారు. బీకేఎస్ జిల్లా శాఖ అధ్యక్షుడు చేకూరి సూర్యనారాయణరాజు, కోకోరైతు సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు ఉప్పుగంటి భాస్కరరావులు కోకో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీకి వివరించారు. గత ఏడాది కిలో కోకో గింజల ధర రూ.1040కు క్యాడ్బరీ సంస్థ కొనుగోలు చేసిందన్నారు. ఈఏడాది జనవరిలో మాత్రం కిలో రూ.650కు కొనగా నేడు రూ.550 మాత్రమే ధర చెల్లిస్తుందన్నారు. అంతర్జాతీయంగా కోకో గింజలకు ఎంతో మార్కెట్ ఉన్నప్పటికీ పండిచిన రైతులకు కనీసం గిట్టుబాటు ధర కూడా అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతర్జాతీయంగా కోకో గింజల ధర రూ.750 ఉన్నప్పటికీ రూ.550 మాత్రమే కోనసీమలో చెల్లిస్తున్నారని వివరించారు. కోకో రైతుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుల దృష్టికి ఇప్పటికే తీసుకువెళ్లాలన్నారు. సకాలంలో గింజలను కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోకో రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కోకో గింజల ఇంపోర్టు డ్యూటీ తగినంత పెంచి రైతుల వద్దనున్న గింజలన్నీ కొనుగోలు చేయడంతో పాటు లాభసాటి ధర కల్పించాలని ఎంపీ హరీష్‌ను అభ్యర్థించారు. కోకో రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. రాష్ట్ర కోకో రైతు సంఘం సహాయ కార్యదర్శి కొప్పిశెట్టి ఆనందవెంకటప్రసాద్, బీకేఎస్ జిల్లా కార్యదర్శి వంకాయల స్వామిప్రకాష్, అడబాల రాజామోహన్, రైతు సంఘ అధ్యక్షుడు అప్పారి వెంకటరమణ, కొలిశెట్టి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు చూపిన ప్రేమమార్గంలో నడుద్దాం..




మామిడికుదురులో శిలువను ఊరేగిస్తున్న క్రైస్తవులు, ఉప్పలగుప్తం: ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువను ఊరేగిస్తున్న దృశ్యం, యానాం: ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

అమలాపురం టౌన్/రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చేసిన పాపాలను తనపై వేసుకుని శిలువపై చెప్పిన ఏడు మాటలను క్రైస్తవ విశ్వాసులంతా గుర్తించుకోవాలని బైబిల్ మిషన్ స్వస్థతశాల పాస్టర్ రెవ జె.ఎబ్రాయిము, విక్టోరియారాణి, మన్నాజూబ్లీ చర్చి వ్యవస్థాపకుడు షారోన్‌రోజ్ కొమానపల్లి, రెవ ఎర్నెస్ట్ తాతపూడి, రెవ ఎస్తేరుజ్యోతి తాతపూడి పేర్కొన్నారు. క్రీస్తు చూపిన ప్రేమమార్గంలో ప్రతీ ఒక్కరూ నడవాలన్నారు. మంచి శుక్రవారం (గుడ్‌ఫ్రైడే)ను పురస్కరించుకుని అమలాపురంలోని ప్రధాన క్రైస్తవ ప్రార్థనా మందిరాలన్నీ క్రైస్తవ విశ్వాసులతో కిటకిటలాడాయి. దేవాది దేవుడైన ఏసుక్రీస్తు పేరున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అమలాపురం మెయిన్‌రోడ్డులోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో క్రీస్తు శిలువపై ఉండి పలికిన ఏడు మాటలను, వాటి పరమార్థాన్ని వారు వివరించారు. మూడో రోజు ఆదివారం తిరిగి ఏసుక్రీస్తు పునరుద్ధానం జరిగే విధానాన్ని తెలియజేశారు. ఈస్టర్ పండుగ సకల జనులకు శుభదినమన్నారు. ఈదరపల్లిలోని బైబిల్ మిషన్ స్వస్థతశాల, మన్నాజూబ్లీ చర్చిలో రెవ జె.ఎబ్రాయిము, రెవ ఎర్నెస్ట్ తాతపూడి, రెవ ఎస్తేరుజ్యోతి తాతపూడి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిపాలవీధిలోని ఆర్సీఎం చర్చి, మెయిన్ రోడ్డులోని లూథరన్, జీడీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వస్థతశాల నుంచి వందలాది మంది క్రైస్తవ విశ్వాసులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈదరపల్లి మీదుగా అమలాపురం వరకు జరిగిన ర్యాలీలో అధికసంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మామిడికుదురు,(ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడేను మండలంలోని క్రైస్తవులు జరుపుకున్నారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ పాటలు పాడుతూ ఊరేగింపు జరిపారు. అప్పనపల్లి చర్చి నుంచి శిలువ ఊరేగింపు ప్రారంభమైంది. పెదపట్నం, నగరం, మామిడికుదురు వరకు సాగిన ఊరేగింపులో అధికసంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు జరుపుకున్నారు. క్రీస్తు లోకాన్ని ప్రేమించినట్టు మనం ఒకరికొకరు ప్రేమకలిగి ఉండాలని ఫాదర్ కె.జోసెఫ్ అన్నారు. దేశంకోసం ప్రార్థిస్తూ పాలగుమ్మి జంక్షన్ నుంచి బి.సావరం శోభన పాఠశాల వరకు శిలువ మార్గంచేశారు. కార్యక్రమంలో ఫాదర్ మార్కోరి, సిస్టర్స్ ఉపదేశి, కె.బుజ్జిబాబు, జి.పాల్, సంఘ పెద్దలు కలిగితి శ్రీను, కట్టా జాన్, కోన రాజు, పీవీఎస్‌రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనా మందిరాల వద్ద క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక గీతాలు ఆలపించారు. దైవజనుల సమక్షంలో క్రీస్తు గొప్పతనాన్ని వివరిస్తూ మండలంలో ప్రార్థనాల మందిరాల వద్ద ప్రార్థనలు, ర్యాలీలు చేశారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి, విమోచన కొరకు యేసుక్రీస్తు శిలువ వేయబడ్డారని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు మోకా సత్తిబాబు అన్నారు. పెదకందాలపాలెం నూతన యేరుషలేము ప్రార్థనా మందిరంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంస్థ అధినేత దానియేలు కుమారుడు ఫిలీస్ గిరీష్ మాట్లాడుతూ పరిశుద్ధుడైన దేవుడు కోసం ప్రతీ ఒక్కరూ ప్రార్థన చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శిలువ వేసిన సమయంలో యేసుక్రీస్తు పలికిన ఏడు మాటలను చదివి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ఎస్పీ సత్తిబాబును సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సంఘ కార్యదర్శి యు.జాన్‌బాబు, గ్రేస్ డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ ఎన్.శ్రీచరణ్, పాస్టర్ జె.కరుణకుమార్, షేక్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు మండలంలోని పలు గ్రామాల్లో జరుపుకున్నారు. శాంతియుత సమాజ స్థాపనకు ఏసుక్రీస్తు శిలువనెక్కి తన త్యాగశీలతను నిరూపించుకున్న వైనాన్ని తలచుకుంటూ క్రైస్తవులు శాంతి గీతాలను ఆలపించారు. పెద్దూరు ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో బ్రదర్ పినిపే జయరాజ్ సారథ్యంలో శాంతి గీతాలాపన చేస్తూ గ్రామాల్లో శిలువ ఊరేగింపు జరిగింది. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): శాంతియుత సమాజం కోసం శిలువనెక్కి క్రీస్తు తన రక్తాన్ని చిందించిన రోజే గుడ్ ఫ్రైడే అని కాట్రేనికోన కింగ్ ఆఫ్ వర్షిప్ చర్చి పాస్టర్ బుంగ డేవిడ్‌జ్యోతి అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆయన ప్రసంగించారు. కాగా చెయ్యేరు, పెనుమల్లె, లక్ష్మీవాడ, బంటుమిల్లి, ఉప్పూడి, నవడపల్లి, గెద్దనపల్లి, కొప్పిగుంట, దొంతికుర్రు, పల్లం, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసుతిప్ప, పోర, మగసానితిప్ప, మొల్లేటిమొగ, కొత్తపాలెం గ్రామాల్లో గుడ్ ఫ్రైడేను జరుపుకున్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా మండలంలోని పలు క్రైస్తవ మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇరుసుమండ, పుల్లేటికుర్రు గ్రామాల్లో శిలువను ఊరేగించారు. అంబాజీపేట హడ్కోకాలనీలో కల్వరి క్రిస్టియన్ ప్రేయర్ హౌస్‌లో బిషప్ జల్లి జార్జి పాపప్, డాక్టర్ జల్లి విక్టర్‌కుమార్, జాన్ మోజెస్ ఆధ్వర్యంలో శిలువ ధ్యాన్య ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ వినయ్‌సాగర్, క్రైస్తవులు పాల్గొన్నారు. మాచవరంలో పాస్టర్ డాక్టర్ చికిలే ధనరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రశాంత్‌కుమార్, కరుణాకరరావు, కుసుమ రత్నం తదితరులు పాల్గొన్నారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రోమన్ కేథలిక్ చర్చిలో ఫాదర్ మారియాదాసు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యానాం పురవీధుల్లో శిలువ యాత్ర నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది క్రైస్తవులు యాత్రలో పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను జరుపుకున్నారు. పలువురు పాస్టర్లు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించి క్రీస్తు సందేశాన్ని అందించారు. రెవ.ఎజ్రాపాస్టర్, టి.నెహమ్యా ఆధ్వర్యంలో తిలోయము స్వస్థత చర్చిలో ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవ సోదరీ సోదరులు పాల్గొన్నారు.

వీరరాఘవులకు మంచి పదవి కేటాయిస్తాం


అంబాజీపేటలో వీరరాఘవులు ఇంట్లో మాట్లాడుతున్న రాంబాబు

అంబాజీపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని ఆశించిన టీడీపీ సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ గణపతి వీరరాఘవులకు త్వరలో మంచి పదవిని కేటాయించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కె.అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. రాఘవులుకు శుక్రవారం మంత్రి ఫోన్‌చేసి మాట్లాడారు. అంబాజీపేట మార్కెట్ కమిటీ పదవి కాపులకు ఇవ్వకపోవడంతో మూడు రోజులుగా కాపువర్గీయులు, పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయం పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లడంతో ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, పలువురు నాయకులు శుక్రవారం వీరరాఘవులు ఇంటికి వెళ్లి బుజ్జగించారు. త్వరలో మంచి పదవి కేటాయించేలా కృషిచేస్తామని వీరరాఘవులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, దొమ్మేటి శ్యామ్, రామారావుపాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఓఎన్జీసీ ముందంజ
మామిడికుదురు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో ఓఎన్జీసీ సంస్థ ముందంజలో ఉంటుందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతనుదాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదాశీర్వచనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఏడీకి నూతన వస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రాంగణంలో ఓఎన్జీసీ నిధులు రూ.5లక్షలతో నిర్మించిన మంచినీటి శుద్ధి కర్మాగారాన్ని పరిశీలించారు. ఈప్లాంటును త్వరలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఆయన వెంట స్థానిక ఓఎన్జీసీ అధికారులు ఉన్నారు.

మత్స్యకార జీవనభృతికి బోట్లు గుర్తింపు
అంతర్వేది, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరులో వేట విరామ సమయంలో మత్స్యకారులకు అందించే జీవనభృతి కోసం బోట్లను గుర్తించి యజమానుల వద్ద నుంచి ఆధార్, బ్యాంకు ఖాతా ధ్రువపత్రాలు తీసుకుని నమోదు చేస్తున్నట్టు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. బోట్లను ఫొటోలు తీసుకుని మత్స్యశాఖ రిజిస్ట్రేషన్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నట్టు తెలిపారు.

రాజోలు డిపో నుంచి అరుణాచలానికి సర్వీసు
రాజోలు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) రాజోలు డిపో నుంచి శుక్రవారం ఉదయం 8గంటలకు అధునాతన టెక్నాలజీ కలిగిన కొత్త ఫుల్లీ ఎయిర్‌కండిషన్ (ఏసీ) 40మంది సిటింగ్ సామర్థ్యం కలిగిన ఇంద్ర బస్సు సర్వీసును ద్వారకా తిరుమల, అరుణాచల గిరి ప్రదక్షిణ, కాంచీపురం, శ్రీపురం, శ్రీకాళహస్తి, విజయవాడకు నడుపుతున్నట్టు రాజోలు డీఎం ధనమ్మ తెలిపారు. ఈనెల 25న రాజోలు డిపో నుంచి బస్సు ప్రారంభమై 27వతేదీ రాత్రి 10గంటలకు రాజోలు డిపోకు చేరుకుంటుందన్నారు. ఏసీ బస్సు టిక్కెట్ ధర రూ.3,800 ఉంటుందన్నారు. టిక్కెట్ల రిజర్వేషన్ల కోసం సెల్ 9866177922లో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి సత్తెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



ఉప్పలగుప్తం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పెదగాడవిల్లిలో రూ.20లక్షలతో నిర్మించిన సత్తెమ్మతల్లి ఆలయంలో ఈనెల19 నుంచి 21వరకు అమ్మవారి శిలావిగ్రహ ప్రతిష్ఠ పూజాకార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దుళ్ల గ్రామానికి చెందిన బాదంపూడి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో కొమాళ్ళపల్లి కాశీవిశ్వనాథం బ్రహ్మత్వంలో ప్రముఖ శైవాగమ పండితుల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు తెలిపారు. ఈనెల21న నూతన ఆలయంలో అమ్మవారి శిలావిగ్రహ ప్రతిష్ఠ నిమ్మకాయల కృష్ణమూర్తి, మహాలక్ష్మి, నూకల వెంకరత్నంనాయుడు, రత్నకుమారి, ఆకుల లక్ష్మణరావు, లక్ష్మి దంపతలు నిర్వహణలో జరుగుతుందన్నారు. కాగా ఈనెల19 20తేదీల్లో జరిగే పూజాకార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు చిక్కం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన ఉంటుందన్నారు. విగ్రహప్రతిష్ఠ రోజున గంగాబత్తుల వీరవెంకటసత్యనారాయణ కుమారులు నాగవెంకటేష్, శిరీష్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనకు ఏర్పాట్లు చేశారు.

దళితుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వంతోనే సాధ్యం

ఐ.పోలవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దళితుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ హెచ్ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు అన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెయ్యేటి శ్రీనుబాబు అధ్యక్షతన ముమ్మిడివరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదంతో దళితులందరికీ సమాన అవకాశాలు దక్కుతాయన్నారు. చంద్రబాబు మాత్రమే దళితులకు న్యాయం చేయగలరని మరో సారి రుజువైందన్నారు. సమావేశంలో సత్తాల ప్రసాద్, వీధి లోవరాజు, బడుగు సాయి, చుట్టుగుళ్ళ అన్నవరం, వీధి నాగభూషణం, చుట్టుగుళ్ళ దాసు, మందపల్లి దొరబాబు, యూ.మోహన్‌రావు, లంక వెంకటేశ్వరరావు, పెదపూడి రుక్మిణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం
అమలాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పేరూరు వై-జంక్షన్‌లో శ్రీమతి సరస్వతిముత్యాలు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో టీఎస్ఎన్ మూర్తి పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని బోడసకుర్రు, పేరూరు సర్పంచ్‌లు రొక్కాల విజయలక్ష్మి, దాసరి అరుణ ప్రారంభించారు. బులుసు జగదీష్, డాక్టర్ గోదశి గంగరాజు, ఉపసర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, పండుఅశోక్‌కుమార్, దొంగ కుమార్, అడపా శ్రీను, నాతి శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు, తాళ్ల సాంబమూర్తి, దాసరి నాగేశ్వరరావు, రొక్కాల నాగేశ్వరరావు, యల్లమిల్లి కొండ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
యానాం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): యానాం అయ్యన్న నగర్‌కు చెందిన పొన్నాడ శ్రీనివాస్ (32) మృతికి యానాం ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బందే కారణమని బంధువులు చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘ అధ్యక్షుడు శేరు కృష్ణ డిమాండ్ చేశారు. రెండు రోజులైనా చర్యలు తీసుకోకపోవడంతో నాయకులు శేరుకృష్ణ, మల్లాడి శామ్యూల్ తదితరులు పరిపాలనాధికారి మునిస్వామిని కలిశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే సోమవారం ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తామని తెలిపారు.

నేడు స్వచ్ఛాంధ్ర దినం
అమలాపురం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల మూడో శనివారాన్ని రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛాంధ్ర దినంగా జరుపుకోవాలని ప్రకటించినట్టు అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. ఈనెల19న పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10.45గంటలకు గడియార స్తంభం సెంటర్ వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమం, స్వచ్ఛతపై విద్యార్థులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

సాహితీ సంబరాల బ్రోచర్ ఆవిష్కరణ
అమలాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో మే 10, 11 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల బ్రోచర్‌ను బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలల కార్యదర్శి బోనం కృష్ణసతీష్ ఆవిష్కరించారు. సాహితీ రంగానికి శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్, జాతీయ ప్రధాన కార్యదర్శి పి.పార్థసారథి తదితరులు చేస్తున్న కృషిని సతీష్ అభినందించారు. కళావేదిక జిల్లాశాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి ఆధ్వర్యంలో భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సాహితీ సంబరాల బ్రోచర్‌ను సతీష్ ఆవిష్కరించారు.

కొనసాగిన ఆర్టీసీ రిలే దీక్షలు


అమలాపురం ఆర్టీసీ డిపోలో రిలే దీక్షలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో డ్రైవర్ బీఎస్ నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 54వ రోజుకు చేరుకున్నాయి. రిలే దీక్షలో జేఎస్ కుమార్, కె.సీతారామయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు. ఉద్యోగులు రెడ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 1/2019 సర్క్యులర్‌ను కచ్చితంగా అమలుచేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.రాంబాబు, ఎఎస్‌యూ డిపో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఔలియా, మణిరాజు, గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర పథకాన్ని అమలుచేసి ఆదుకోవాలి
అమలాపురం టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా వాహనమిత్ర పథకాన్ని అమలుచేసి ఆదుకోవాలని ఆటో యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్టు ఆటో కార్మికుడికి రూ.15వేలు చొప్పున చెల్లించాలన్నారు. మేడే కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటో డ్రైవర్లకు కార్మికశాఖ ఆధ్వర్యంలో ఖాకీ రంగు ఏకరూపు దుస్తులు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సత్తిరాజు కోరారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం
ముమ్మిడివరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మద్యానికి బానిసైన ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతానికి చెందిన తోట రాము(22) గురువారం రాత్రి భార్యతో గొడవపడి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పుఅంటించుకున్నాడు. తోట రాము-సంధ్యలది కులాంతర వివాహం. వీరికి నాగచైతన్య అనే కుమారుడు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన అతడ్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.జ్వాతాసాగర్ తెలిపారు.

శ్యామ్‌బాబు మృతికి సంతాపం
అమలాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్‌ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ అధ్యక్షుడు కొండేపూడి శ్యామ్‌బాబు ఆకస్మిక మృతికి నడిపూడి డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ సంతాపం ప్రకటించింది. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన శ్యామ్‌బాబు మృతి తీరని లోటన్నారు. శ్యామ్‌బాబు ఎన్నో పాదయాత్రలు విజయవంతంగా చేశారని సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శ్యామ్‌బాబు చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో కార్యదర్శి చాట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కాప నాగభూషణం, తొత్తరమూడి ప్రభాకరరావు, మంద వెంకటేశ్వరరావు, మోకాటి అమ్మరాజు, కొడమంచిలి కృష్ణ, పెదపూడి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారుడు సత్యనారాయణకు డాక్టరేట్



మామిడికుదురు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరం గ్రామానికి చెందిన బుర్రకథ కళాకారుడు మంగం సత్యనారాయణ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీ రామారావు కళామందిర్‌లో శ్రీపొట్టిశ్రీరాములు యూనివర్శిటీ డాక్టరేట్ అవార్డుతో గురువారం సన్మానించింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సత్యనారాయణను నగరంలో పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



అమలాపురం టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీ స్వామివివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న టి.పూజిత, బి.సహశ్రీ, ఆర్.సువర్ణకుమారి, జి.లక్ష్మీ ప్రసన్న, జి.మణికంఠ, ఎన్.రాహుల్, పి.సత్య రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు యోగాగురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. భీమవరంలో జరిగిన యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన ఏడుగురు విద్యార్థులు ఈనెల22న శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తింప చేయాలి
యానాం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): యానాం ప్రాంతానికి వలస వచ్చిన ఎస్సీ, ఓబీసీలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తింప చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వెళ్లిన మల్లాడి గురువారం రాత్రి ప్రధాని నరేంద్ర మోదీ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మీడియాతో మల్లాడి మాట్లాడారు. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో జనరల్ కేటగిరీగా ఉన్న వలస ఎస్సీ, ఓబీసీలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు కావడంలేదన్నారు. బతుకుతెరువు కోసం వలస వచ్చిన వీరు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని తగిన న్యాయం చేయాలని మల్లాడి లేఖలో కోరారు.

అంతర్వేది ఆలయ భూములపై కమిటీ
అంతర్వేది, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములకు సంబంధించి ఐదు శాఖలతో కూడిన కమిటీని అమలాపురం ఆర్డీవో ఏర్పాటు చేశారని ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. దేవదాయశాఖ, రెవెన్యూ, మత్స్యశాఖ, వ్యవసాయశాఖ, మండల పరిషత్‌ల సంయుక్త నిర్వహణలో భూసర్వే నిర్వహించాలని ఆమె ఆదేశించారన్నారు. అంతర్వేది, శృంగవరప్పాడు, గొంది, కేశవదాసుపాలెం గ్రామాల్లో 726.97 ఎకరాల భూమి ఉందన్నారు. రైతుల నుంచి శిస్తు వసూలుకు, నీలకంఠేశ్వరస్వామి దేవస్థానానికి 358.56 ఎకరాల భూమి ఉందన్నారు. ఈభూముల్లో రైతులకు సంబంధించి శిస్తు వసూలు, పెంపుపై సర్వే నిర్వహిస్తారని తెలిపారు. బకాయిలు చెల్లించకపోతే భూమి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

భయాన్ని వీడితే ప్రమాదాల నివారణ
అమలాపురం రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు భయాన్ని వీడి చాకచక్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలను నివారించడంతో పాటు నష్టాన్ని ఎంతో తగ్గించవచ్చునని అమలాపురం అగ్నిమాపక అధికారి కేవీ మురళీకొండబాబు పేర్కొన్నారు. శుక్రవారం అమలాపురం పట్టణ, పరిసర గ్రామాల్లో విస్తృత అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈదరపల్లిలోని రాయల్ ఫిల్లింగ్ స్టేషన్, పేరూరులోని రాజరాజేశ్వరి హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ గోడౌన్, బహుళ అంతస్తుల భవనాల వద్ద అగ్నిప్రమాదాల నివారణపై స్థానికులకు ఆయా కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించారు.


రవికుమార్‌కు రంగస్థల పురస్కారం



అంతర్వేది, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలానికి చెందిన ప్రముఖ కవి, రచయిత నల్లి రవికుమార్ రాష్ట్ర స్థాయి కందుకూరి రంగస్థల పురస్కార అవార్డును విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి అందుకున్నారు. వీటీ జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్న రవికుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజా, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

గ్యాస్ పంపిణీ సిబ్బందికి అవగాహన
ముమ్మిడివరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి కేవీ మురళీకొండబాబు సూచించారు. శుక్రవారం ముమ్మిడివరం నగరపంచాయతీ కొండాలమ్మచింత సమీపంలో గల పెట్రోల్ బంకులో పనిచేస్తున్న సిబ్బందికి, వాహన చోదకులకు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. అలాగే రాజేలంకలోని గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న సిబ్బందికి, గ్యాస్ డెలివరీ బాయ్‌లకు, గ్యాస్ యాజమాన్యానికి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీహన్వితకు బంగారు పతకం



అంతర్వేది, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలేనికి చెందిన నాల్గో తరగతి చదువుతున్న యెనుముల లక్ష్మీ హన్విత భగవద్గీత పోటీల్లో బంగారు పతకం సాధించినట్టు తండ్రి రమణ తెలిపారు. మైసూర్‌కు చెందిన గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆన్‌లైన్‌లో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో లక్ష్మీహన్విత ఎంపికై బంగారు పతకం కైవతం చేసుకుందన్నారు. పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు తదితరులు చిన్నారికి అభినందనలు తెలిపారు.

కొబ్బరి కార్మికులను ఆదుకోవాలి
మలికిపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి బోర్డు ఏర్పాటు ద్వారా కొబ్బరి కార్మికులను ఆదుకోవాలని కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. 35ఏళ్ల నుంచి కార్మికుల సమస్యపై పోరాటం చేస్తున్నామని, కొబ్బరి బోర్డు ఏర్పాటుచేయాలని, 50ఏళ్లు దాటిన కార్మికులకు పింఛన్ ఇవ్వాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

విశ్రాంత డీఈపై దాడి: వ్యక్తిపై కేసు
అమలాపురం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్యూలైన్‌లో ఇద్దరి మధ్య ఏర్పడ్డ వివాదం కారు ఆపి దాడిచేసే స్థితికి చేరుకున్న ఘటనపై అమలాపురం పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అమలాపురం గారపాటివీధికి చెందిన ఆర్‌అండ్‌బీ విశ్రాంత డీఈ యేడిద సూర్యప్రకాశరావు ఈనెల16న కూచిమంచి అగ్రహారంలోని సెంట్రల్ బ్యాంకుకు వెళ్లి క్యూలైన్‌లో నిలబడ్డారు. కాకినాడకు చెందిన బసవా ఆదినారాయణమూర్తి కూడా క్యూలైన్‌లో ముందుకు వెళ్లే సమయంలో సూర్యప్రకాశరావుతో ఘర్షణకు దిగారు. పని ముగించుకుని బయటకు వచ్చి కారు ఎక్కే సమయంలో సూర్యప్రకాశరావుపై ఆదినారాయణమూర్తి పిడిగుద్దులు గుద్ది దాడికి పాల్పడగా గాయపడ్డారు. ప్రకాశరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి
అంబాజీపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని విజయవాడ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మోకా సత్తిబాబు అన్నారు. అంబాజీపేట జయంతినగర్‌లో నేలపూడి సూరన్న బ్రదర్స్, కుటుంబ సభ్యులు, జయంతినగర్ సేవా సంఘం, యువసేన సహకారంతో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఆశయం.. లక్ష్యాలపై కళారూపం, సంఘం శరణం గచ్ఛామి నాటకం శుక్రవారం రాత్రి ప్రదర్శించారు. సామాజికవేత్త నేలపూడి స్టాలిన్‌బాబు ఆధ్వర్యంలో 50మంది రక్తదానం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ సత్తిబాబు మాట్లాడారు. అంబేడ్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా అందరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మైలా ఆనందరావు, చింతా రాజేంద్రప్రసాద్, కత్తుల బాబులు, నేలపూడి గిరి, గోసంగి సత్యనారాయణ, సాధనాల బాలకృష్ణ, కోట సత్తిబాబు, పొలమూరి వెంకట్, కోట హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే సత్యానందరావు



వాటర్ ట్యాంక్, కుళాయిలను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం వాడపాలెం గ్రామంలో ఇంటింటికి తాగునీటి పథకం ద్వారా నిర్మించిన వాటర్ ట్యాంకును, తాగునీటి పంపిణీ కుళాయిలను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ సర్పంచ్‌గా ఎన్నికై ఢిల్లీలో అవార్డును అందుకున్న త్సామా ఆదినారాయణమూర్తి(బాబు)ను వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు కృషి

కొత్తపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా ఏటిగట్టు రహదారిని అభివృద్ధి చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీ హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఏటిగట్టుపై నూతన రోడ్డు నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశా రు. ఈ రోడ్డు నిర్మాణంతో భక్తులకే కాకుండా గ్రామస్తులకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల రామకృష్ణ, చింతం విజయకృష్ణమోహన్, ధర్నాల రామకృష్ణ, మార్గాన గంగాధరరావు, సర్పంచ్ బూసి జయలక్ష్మి, సిద్ధంశెట్టి వీరవెంకట సత్యనారాయణ కూటమి నాయకులు, కార్య కర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో కందుకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కందుకూరిని నేటితరం అధ్యయనం చేయాలి

రావులపాలెం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వితంతు వివాహాలను చేయడంతో పాటు బాలిక విద్యకోసం తన సొంత ఆస్తులను ఖర్చు చేసిన కందుకూరి వీరేశలింగాన్ని నేటితరం అధ్యయనం చేయాలని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో కందుకూరి జయంతిని నిర్వహించారు. ముందుగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్యాట్రన్ డాక్టర్ తల్లా రవికుమార్ ఆధ్వర్యంలో అరసం సంఘ జిల్లా అధ్యక్షుడు గండి స్వామిప్రసాద్ వీరేశలింగం ఒకడు మిగిలిన చాలును అనే కవితాంశంపై కవి నీరాజనం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి వచ్చి కవులు కందుకూరి కృషిపై కవితలు వినిపించారు. వాటిని సాహిత్యవేత్తలు శ్రీపాద సీతామహలక్ష్మి, కృష్ణశ్రీ, గొడవర్తి శ్రీనివాస్ విశ్లేషించారు. గ్రంథాలయ పునర్ వికాస ఉద్యమవేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో వీరేశలింగం సంస్కరణోద్యమం, సమకాలినత అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుగొండ లక్ష్మీనారాయణ, కవి అద్దేపల్లి ప్రభు మాట్లాడారు. అనంతరం కవితలు వినిపించిన కవులకు ప్రశంస పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబస్సు, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కాజా మొహిద్దీన్, జిల్లా అధ్యక్షులు ఆర్‌ఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.4.80లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,80,428 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి కృష్ణా జిల్లా పడమటకు చెందిన పాలడుగు రామనాథబాబు కుటుంబ సభ్యులు రూ. 50,116లు, వాడపల్లికి చెం దిన ఎస్.ఎరకయ్య, సూర్యాకాంతం దంపతులు రూ.30,116 విరాళాలు ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆల యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులతోపాటు భక్తుల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

స్వయం ఉపాధితో మహిళలకు ఆర్థికాభివృద్ధి



ఆలమూరులో మహిళలకు కుట్టుశిక్షణ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆలమూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు, చొప్పెల్ల గ్రామాల్లో ప్రభుత్వం అందించే కుట్టుశిక్షణలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నదని తెలిపారు. ఇందులో భాగంగా వారికి కుట్టుశిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారని అన్నారు. కార్యక్రమంలో ఆలమూరు ఏంపీడీవో ఎ.రాజు, కూటమి నాయకులు మెర్ల గోపాలస్వామి, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, సలాది నాగేశ్వరరావు, నాగిరెడ్డి స్వామి, సూరపురెడ్డి సత్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్, బీరువా, బెంచీలు అందజేత

కె.గంగవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట ప్రాథమిక పాఠశాలకు టీడీపీ సీనియర్ నాయకుడు నేమాని సత్తిబాబు బెంచీలు, బీరువా, ప్రింటర్, గ్రీన్ బోర్డు, ఫర్నిచర్‌ను బహుకరించా రు. శుక్రవారం పాఠశాలలో వీటిని గ్రామ ప్రముఖుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కూటమి నాయకులు దొమ్మేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు ఉపకరణాలు అందజేస్తున్న సత్తిబాబు

యువకుడి ఆత్మహత్యాయత్నం

ముమ్మిడివరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మద్యానికి బానిసైన ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతానికి చెందిన తోట రాము(22) గురువారం రాత్రి భార్యతో గొడవపడి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోట రాము-సంధ్యలది కులాంతర వివాహం. వీరికి నాగచైతన్య అనే కుమారుడు ఉన్నారు. తీవ్రంగా గాయపడ్డఅతడ్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

విశ్రాంత డీఈపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్యూలైన్‌లో ఇద్దరి మధ్య ఏర్పడ్డ వివాదంపై అమలాపురం పోలీసులు శుక్రవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అమలాపురం గారపాటివీధికి చెందిన ఆర్‌అండ్‌బీ విశ్రాంత డీఈ యేడిద సూర్యప్రకాశరావు ఈనెల16న కూచిమంచి అగ్రహారంలోని సెంట్రల్ బ్యాంకుకు వెళ్లి క్యూలైన్‌లో నిలబడ్డారు. కాకినాడకు చెందిన బసవా ఆదినారాయణమూర్తి కూడా క్యూలైన్‌లో ముందుకు వెళ్లే సమయంలో సూర్యప్రకాశరావుతో ఘర్షణకు దిగారు. ప్రకాశరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కరీంనగర్‌కు చెందిన చిగురు కొమురయ్య, లక్ష్మి దంపతులు శుక్రవారం రూ.10,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి కె.శ్రీనివాసరాజుకు అందించారు. ఆలయ సిబ్బంది వారికి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.



ద్రాక్షారామలో శిలువ మార్గం నిర్వహిస్తున్న క్రైస్తవులు



కొత్తపేటలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఆత్రేయపురం మండలం వద్దిపర్రు చర్చిలో ప్రార్థనలు

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

కె.గంగవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం గుడ్ ఫ్రైడేని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ఆయా చర్చ్‌లలో ప్రార్థనలు చేశారు. యండగండి, పామర్రు, అముజూరు, కె.గంగవరం తదితర గ్రామాల్లో చర్చ్‌లు కిటకిటలాడాయి.

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలంలో గుడ్ ఫ్రైడేను ఘనంగా జరిపారు. వెలంపాలెం శివారు తిరణం పేట నుంచి తోటపేట ఆర్‌సీఎం చర్చి వరకు శిలువ మార్గం నిర్వహించారు. ఫాదర్ జోషఫ్ ప్రభాకర్, సహాయ గురువు విమల్‌రాజు మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సహనంతో జీవించాలన్నారు. ప్రార్థనల్లో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లోని పలు చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని మండలంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ జి.అబేద్నగో ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వక్తలు ఏసుక్రీస్తు బోధనలు వినిపించారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో గుడ్ ఫ్రైడేని ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిల వద్ద ఏసుక్రీస్తు త్యాగాలను స్మరించుకున్నారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో ముందుకు నడవాలని పాస్టర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గుడ్ ఫ్రైడేను నిర్వహించారు. మండలంలోని కూర్మాపురం గ్రామంలో సెంటినరీ బాప్టిస్టు చర్చిలో పాస్టర్ బక్కి సత్యదాస్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ సత్యదాస్ మాట్లాడారు. సెంటనరీ బాప్టిస్టు చర్చ్ యూత్ సభ్యులు క్రైస్తవ గీతాలు ఆలపించారు. రాయవరం క్రీస్తు సంఘం లవ్ అండ్ కేర్ ఎడ్యుకేషనల్ ట్రస్టులో పాస్టర్ టి.నతానియేలు, చెల్లూరులో పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు జె.సల్మాన్ రాజు, లొల్లలో పాస్టర్ ప్రభవ్ కుమార్, కూర్మాపురంలో వి.శ్యామూల్ రాజు ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు జరిపారు. మండలంలోని ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేను నిర్వహించారు. కపిలేశ్వరపురం విలియం మేయర్ మిషనరీ ఆసుపత్రి నుంచి గ్రామ వీధుల గుండా ఆర్‌సీఎం చర్చి వరకూ యేసు శిలువతో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌సీఎం సంఘం నూతన విచారణ గురువు స్లీవరాజు, ఫాదర్ రాజ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో క్రీస్తు ఆరాధకులు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



మండపేట కెనాల్ రోడ్డులో పండ్లు విక్రయిస్తున్న వ్యాపారి

మార్కెట్‌లో జోరుగా

సీజనల్ పండ్ల విక్రయాలు

మండపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు ప్రాంతాల్లో సీజన్‌లో దొరికే పలు రకాల పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఏడాదికోసారి వచ్చే రామాఫలాలు, గులాబ్ జామకాయలు, నేరేడి పండ్లు వంటివి రోడ్డుపక్కన విక్రయిస్తూ చిరు వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. మండపేట రామచంద్రపురం కెనాల్ రోడ్డులో కొన్ని రోజులుగా సీజనల్ పండ్ల విక్రయాలు జోరుగా సాగుతుండటతో చిరు వ్యాపారులు హర్షం చేస్తున్నారు.



డాక్టరేట్ అందుకున్న సత్యనారాయణ

బుర్రకథ కళాకారుడు సత్యనారాయణకు డాక్టరేట్

మామిడికుదురు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరం గ్రామానికి చెందిన బుర్రకథ కళాకారుడు మంగం సత్యనారాయణ డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీ రామారావు కళామందిర్‌లో పొట్టిశ్రీరాములు యూనివర్శిటీ డాక్టరేట్ అవార్డుతో గురువారం సన్మానించింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నగరంలో పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ తీరుతో తిరుమల ప్రతిష్టకు భంగం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల ప్రతిష్టను దెబ్బతీసేలా వైసీపీ వ్యవహరిస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేతోపాటు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. తిరుమలలో గోశాల వ్యవహారంపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను మానుకోవాలన్నారు. గోశాలలో గోవులు మరణించకపోయినా దానిపై రాద్ధాంతం చేస్తూ వైసీపీ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తు న్నదన్నారు. వైసీపీ పాలనలో తిరుమలలో జరిగిన అపచారాలు, అక్రమాలను సరిదిద్ది తిరుమలకు పూర్వ వైభవం తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ప్రభుత్వానికి, టీటీడీ పాలకమండలికి వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేకే వైసీపీ రోజుకో వివాదాన్ని సృష్టిస్తున్నదన్నారు. కార్యక్రమంలో విళ్ల మారుతీప్రసాద్, కొప్పిశెట్టి ప్రసాద్, బొక్కా ప్రసాద్, బోడపాటి మారుతి, మజ్జి తరుణ్, జక్కంపూడి బాలాజీ, కముజు వరప్రసాద్, దంగేటి సాయి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం



కొత్తపేట కైలాస భూమికి విరాళం ఇస్తున్న మందపల్లి మాజీ సర్పంచ్ విజయకృష్ణమోహన్

కైలాస భూమికి విరాళం

కొత్తపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట కైలాస భూమి శ్మశాన వాటికకు మందపల్లి మాజీ సర్పంచ్ చింతం విజయకృష్ణమోహన్ రూ.లక్ష విరాళం ఇచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌లకు ఆయన అందచేశారు. ఈ సందర్భంగా వారు ఆయన్ను అభినందించారు. కైలాస భూమిని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని దాతలు ముందుకు రావాలన్నారురు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ఎన్.వీరరాఘవులు, సిద్ధంశెట్టి వీరవెంకట సత్యనారాయణ, కొల్లి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



రాయవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పుప్పాల మంగతాయారు (103) శుక్రవారం మృతి చెందారు. తన పనులు తానే చేసుకుంటూ ఆరోగ్యంగా తిరిగే ఈ వృద్ధురాలు ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురై శుక్రవారం వెదురుపాకలో కన్నుమూసినట్లు ఆమె మనవడు పంచాయతీ కార్యదర్శి పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. మృతిరాలికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె అంత్యక్రియలు వెదురుపాకలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు.



యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

అమలాపురం టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీస్వామివివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న టి.పూజిత, బి.సహశ్రీ, ఆర్.సువర్ణకుమారి, జి.లక్ష్మీప్రసన్న, జి.మణికంఠ, ఎన్.రాహుల్, పి.సత్య రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. భీమవరంలో జరిగిన యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన ఏడుగురు విద్యార్థులు ఈనెల22న శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వేసవిలో పశువుల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

పాడి రైతులకు విశ్రాంత జేడీ డాక్టర్ విజయకుమార్ శర్మ సూచనలు

మండపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పశువుల సంరక్షణకు అన్ని జాగ్రతలు తీసుకోవాలని మండపేట పశుశిక్షణ కేంద్రం విశ్రాంత జేడీ డాక్టర్ విజయ కుమార్ శర్మ రైతులకు సూచించారు. వేసవి నేపథ్యంలో పాడి రైతులు పశువుల పెంపకంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు ఆవులకంటే గేదెలు ఎక్కువగా ఎండవేడిని తట్టుకోలేక రోగాలబారిన పడతాయన్నారు. పాడి రైతులకు ఆయన ఇలా సూచిస్తున్నారు.

పశువుల్లో వడదెబ్బ: అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరించకపోవటం, షెడ్లలో పశువులను అధిక సంఖ్యలో ఉంచటం, ఉక్కపోత, నీటి వసతి లేకపోవటం, వల్ల పశువులు వడదెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులను సత్వరమే చల్లటి గాలి వీచే ప్రదేశంలోకి తీసుకు వెళ్లాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గించేందుకు పలు సార్లు నీటితో కడగటం చేయాలి. తక్షణమే పశువైద్యుడిని సంప్రదించాలన్నారు.

వేసవిలో యాజమాన్య పద్ధతులు: ఎండ తీవ్రత నుంచి పశువులను కాపాడుకునేందుకు పశువుల పాకను ఎత్తుగా ఉండేలా గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలి. పాకల చుట్టూ చెట్లను నాటాలి. పశువుల పాకపై ఉండే కప్పును తరచూ తడుపుతూ ఉండాలి. దానివల్ల పాకలోకి వేడితగ్గి చల్లదనం వస్తుంది. చల్లటి నీటితో రోజు పశువును రెండు లేదా మూడుసార్లు కడుగుతుండాలన్నారు.



ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందుతున్న పశువులు

పశువుల మేత విషయంలో: ఎండవేడి వల్ల పాడిపశువులు ఎక్కువగా మేత తినలేవు. జీర్ణప్రక్రియ మందగిస్తుంది. తేలికగా జీర్ణమయ్యే గంజి, జావ వంటివి ఇవ్వటం మంచిది. ఎక్కు వగా పచ్చిమేత, ఉదయం ఎండుగడ్డి రాత్రి వేళల్లో పశువుకు పెట్టాలి. పశువుల దాణా నీటిలో కలిపి ఇవ్వాలన్నారు. పశువులను ఉద యం 6 గంటల నుంచి 10 వరకు, సాయం త్రం 4 గంటల నుంచి 7 వరకు మాత్రమే బయటకు వదలాలన్నారు.

ఆరోగ్య పరిరక్షణ: వ్యాధి నిరోధకశక్తి తగ్గటం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ముందుగా పశువులకు టీకాలు వేయించాలి. దాహంతో వున్న పశువులకు శుభ్రమైన మంచినీరు అందించాలి. కలుషిత నీటిని తాగకుండా చూడాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని పాడి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శర్మ రైతులకు సూచించారు.



ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే..

- పల్లె నుంచి పట్టణం వరకు ఆగని ప్లాస్టిక్ కవర్ల వాడకం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

మండపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గతంలో బజారుకు వెళ్లితే చేతి సంచి తీసుకుని వెళ్లేవారు. ఇప్పుడు మార్కెట్‌లో వ్యాపారులు ఇచ్చే ప్లాస్టిక్ కవర్లలో సరుకులు పట్టుకుని ఇంటికి వస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేదించినా ఎక్కడా అది అమలు కావటం లేదు. ప్రభుత్వ ప్రకటనలే తప్ప నిషేదం అమలవుతున్న దాఖలాలు కనిపించటం లేదు. ప్లాస్టిక్ కవర్లతోపాటు, ప్లాస్టిక్‌ను పోలిన కవర్లు వినియోగించటం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని పరిశోధనల్లో వెల్లడైంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కేంద్ర ప్రభుత్వం గతంలోనే నిషేదించింది. 120 మైక్రాన్‌ల కన్నా ఎక్కువ మందం వున్న వాటినే అనుమతిస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు నామమాత్రపు దాడులు చేసి జరిమానాలు వేసి చేతులు దులుపుకోవటం తప్ప పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ కవర్ల నిషేదం మాత్రం అమలు జరగటం లేదు. సాధారణ వస్తువులతోపాటు, ఇటీవల టీ, కూరలు, ఆహారం, సాంబారు వంటివి కూడా కవర్లలో వేసి ప్యాక్ చేసి ఇస్తున్నారు. దానివల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నా ఎవరూ పట్టించుకోవటం లేదు. ప్లాస్టిక్ కవర్లలో వేడివేడి ఆహార పదార్థాలు తీసుకు వెళ్లటం వల్ల రసాయనిక చర్య జరిగి హానికరమైన కణాలు తయారవుతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోవటం వల్ల భూసారం తగ్గిపోతుంది. వర్షం నీరు భూగర్భంలోకి ఇంకకుండా అడ్డుపడుతుంది. దీని ఫలితంగా భూగర్భజలాలు లభ్యత తగ్గిపోతుందని పలువురు పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ ముప్పు పొంచి ఉందని డాక్టర్ బిక్కిన కృష్ణార్జునచౌదరి తెలిపారు. ప్లాస్టిక్ తయారీకి వినియోగించే రసాయనాలు మనం తెచ్చుకునే ఆహర పదార్థాల్లో కలిసిపోయి మన తీసుకునే ఆహారంలో చేరి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆయన అన్నారు. ప్లాస్టిక్ వినియోగం ఎంత తగ్గిస్తే అంత మంచిదని ఆయన సూచిస్తున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



అమలాపురం ఆర్టీసీ డిపోలో దీక్షలు చేస్తున్న దృశ్యం

అమలాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో డ్రైవర్ బీఎస్ నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 54వ రోజుకు చేరుకున్నాయి. రిలే దీక్షలో జేఎస్ కుమార్, కె.సీతారామయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు. ఉద్యోగులు రెడ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 1/2019 సర్క్యులర్‌ను కచ్చితంగా అమలుచేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.రాంబాబు, ఎఎన్‌యూ డిపో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఔలియా, మణిరాజు, గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.